# క్షమ

దూరం నుంచే విన్పించింది చిరంజీవి ఏడుపు. చదువుతోన్న పేపరు వదిలేసి గబగబా గదిలోంచి బయటికొచ్చాడు వెంకట్రావు.

తండ్రిని చూసిన చిరంజీవి బావురుమంటూ కాళ్ళకు చుట్టుకుపోయాడు. కొడుకుని లేవదీస్తూ తండ్రి "ఏమైందమ్మా? ఎందుకేడుస్తున్నావు? ఛ! అలా ఏడవ్వచ్చునా?" అంటూ వీపు నిమురుతూ బుజ్జగించాడు.

చిరంజీవి చెప్పలేక చెప్పలేక వెక్కిళ్ళ మధ్య — "నన్ను .... కుంటీ .... కుంటీ .... అంటూ వెక్కిరిస్తున్నారు నాన్నా వాళ్ళంతా" అంటూ వీధిలో గోలగా ఆడుకుంటోన్న పిల్లలకేసి చూపించాడు.

"బాబూ!" అంటూ వెంకట్రావు కొడుకుని హత్తుకున్నాడు.

చిరంజీవి కొంచెం తేరుకుని తండ్రి మొహంలోకి అమాయకంగా చూశాడు. తండ్రి దగ్గర ఎప్పుడూ చనువులేని చిరంజీవి కుంటివాడయ్యాకే అంత చేరువయ్యాడు. తండ్రి మొహంలోకి చూస్తూ "నాన్నా! నేను నిజంగా కుంటివాడినా నాన్నా?" అన్నాడు.

తండ్రి కంఠం వణికింది. "ఛా! నువ్వు .... కుంటివాడివి కాదు నాన్నా!"

"మరి నా కాలూ చెయ్యీ వంకరగా ఇలా అయ్యాయి నాన్నా!"

"లేదమ్మా! ఫర్వాలేదు. మళ్ళీ మామూలుగానే అయిపోతాయి."

"ఎప్పుడు నాన్నా? నిజంగానా?"

"నిన్నింకా పెద్ద డాక్టరు గారికి చూపిస్తానుగా? నీ కాలూ, చెయ్యీ పూర్తిగా బాగైపోతాయి."

"నేను రామూలాగా పరిగెత్తుతానా నాన్నా?"

"రామూ కన్నా బాగా పరిగెత్తుతావు. వేణూ కన్నా బాగా ...."

"వేణూ అస్సలు పరిగెత్తడు నాన్నా!"

"అలాగా? అయితే రామూలాగా పరిగెత్తుతావు."

"మరి, నా కొత్త జోళ్ళు తొడుక్కుంటానా నాన్నా?"

"ఎందుకు తొడుక్కోవు? ఇంకా కొత్త బూట్లు కొంటాను. అవన్నీ తొడుక్కుంటావు."

"సైకిల్ తొక్కలేనా నాన్నా? సావిత్రి తొక్కలేవు అంది నాన్నా!"

"ఉత్తది. అలాంటి మాటలు నమ్మకూడదమ్మా! నువ్వు సైకిల్ చక్కగా తొక్కుతావు. కొన్నాళ్ళకి నీ కాళ్ళు చక్కగా బాగైపోతాయి."

కొడుక్కి నమ్మకం కలిగినట్టే కనిపించింది తండ్రికి.

"నాన్నా!" అన్నాడు కొడుకు మళ్ళీ.

"ఏవిటమ్మా?" అంటూ ఆప్యాయంగా అడిగాడు తండ్రి.

"అప్పుడు నాకు పెద్ద జొరం వచ్చింది కదూ?"

"వెధవ జ్వరం! అప్పుడే పోయిందిగా?"

"అప్పుడేకదూ నా కాలు ఇలా అయిపోయింది నాన్నా?"

"అవునమ్మా!"

"జొరంవస్తే కాళ్ళు ఇలా వంకరగా అయిపోతాయా నాన్నా?"

ఈసారి కూడా — "అవునమ్మా!" అనలేక పోయాడు తండ్రి.

కొడుకుని గట్టిగా గుండెలకు అదుముకున్నాడు వెంకట్రావు. వెచ్చటి కన్నీటిబొట్లు బుగ్గలమీద పడితే తెల్లబోతూ చూశాడు చిరంజీవి — "ఏడుస్తున్నావేం నాన్నా?"

గబగబా కళ్ళు తుడుచుకుని "లక్ష్మీ" అంటూ కేకపెట్టాడు వెంకట్రావు. పిల్లాణ్ణి ఎత్తుకుని లోపలికి తీసుకెళ్ళాడు.

"బాబుని కాస్సేపు నీ దగ్గర కూర్చోబెట్టుకో లక్ష్మీ! ఎండ తగ్గాక బైటికి తీసికెళ్తాను."

"ఆడుకుంటానని వెళ్ళాడుగా? పిల్లలంతా వీధిలో ఆడుకుంటున్నారుగా?" అంటూ లక్ష్మి కొడుకుని అందుకుని దగ్గర నిలబెట్టుకుంది.

"ఏం ఆడుకుంటాడు లెద్దూ! వాళ్ళంతా ఏదేదో అంటారు" అన్నాడు వెంకట్రావు.

"అదేం చాదస్తం? వాళ్ళేం అంటారు? ఏవిటా!

వాళ్ళేమన్నారు నిన్ను?"

వెంకట్రావు విసుక్కున్నాడు — "అదిగో, అవన్నీ అడక్కు వాణ్ణి! మళ్ళీ ఏడుస్తాడు. కాసేపు నీ దగ్గర కూర్చోబెట్టుకో" అంటూ గబగబా గదిలోకి వెళ్ళి పోయాడు.

మనస్సంతా పిండినట్టయిపోయింది. ఆరోగ్యంగా రెండు కాళ్ళతో లేడికన్నా చురుగ్గా గంతులేసే పిల్లాడు కుంటివాడయ్యాడు!

పుట్టినప్పుడు చక్కటి అవయవాలతోటే, ఏ లోటూ లేకుండానే పుట్టాడు. ఏడేళ్ళు నిండకుండానే అవిటి వాడై పోయాడు!

"నేను జోళ్ళు వేసుకుంటానా నాన్నా? .... రాము లాగ పరుగెత్తుతానా నాన్నా? .... సైకిల్ తొక్కలేనా నాన్నా?"

ఎంత సహజమైన కోరికలు అవి! బిడ్డకి అవి ఎంత అసంభవమైపోయాయి!

వెంకట్రావు కళ్ళు రెండూ మూసుకుని వెనక్కి వాలిపోయాడు. ఏం చెప్తాడీ నాన్న? ఏం చెప్పగలడీ నాన్న?

★ ★ ★

ఆర్నెల్లనించీ ఎన్నోసార్లు కళ్ళముందు కదలాడిన గతం, ఇంకోసారి కదిలింది.

ఆరోజు .... వెంకట్రావు అకారణంగా ఆఫీసరు కోపానికి గురై, హెచ్చరికలు చేయించుకుని, అభిమానంతో వుడుకుతూ ఇంటిముఖం పట్టాడు.

"వెంకట్రావుగారూ!" అన్న పిలుపైతే వినబడిందే గానీ వెంకట్రావు ముందుకే నడిచాడు — "ఎంత మంది వెంకట్రావులు లేరు గనుక?" అనుకుంటూ.

"వెంకట్రావుగారూ! మిమ్మల్నేనండీ!" అంటూ ఆ పిలుపు వెంకట్రావునే వెన్నాడింది.

విసురుగా పోతున్న వెంకట్రావు చిరాగ్గా వెనక్కి తిరిగి చూశాడు. రాని నవ్వు తెచ్చుకుంటూ "మీరా మాష్టారూ? నన్ను పిల్చారా?" అన్నాడు.

"అవును బాబూ! కాస్త ఖాళీ చూచుకుని మీ ఇంటికైనా రావాలనుకున్నాను. మీ వాడి గురించి కొంచెం చెప్పాలని."

"ఏమిటి మాష్టారూ? మా అబ్బాయేం చేశాడు?"

"అబ్బే! ఏదో చేశాడని కాదు. బొత్తిగా చదవటం లేదు. ఎంతసేపూ అల్లరీ, పక్క పిల్లల్తో పేచీలూ. ఏది చెప్పినా చదవడూ, రాయడూ. కాస్త మీరుకూడా ఇంటి దగ్గర చదివించాలి బాబూ!"

మాష్టారి మాటలకు అడ్డు తగిలాడు వెంకట్రావు — "అలాగా? నేను చూస్తాను మాష్టారూ!" అన్నాడు.

"వాడి తల్లితోకూడా కాస్త శ్రద్ధ చెయ్యమని చెప్పు బాబూ!"

"అలాగేనండీ! నాకు చెప్పి మంచిపని చేశారు."

కొడుకుమీద వెంకట్రావుకి చాలాకోపం వచ్చింది. మాష్టారు అంత గోలపెడుతూ చెప్పారంటే వీడు చాలా అల్లరి నేర్చాడన్నమాటే! చదువూ సంధ్యా లేకుండా ఇలా తయారవుతున్నాడా!

★ ★ ★

ఇంటికి వస్తూనే వెంకట్రావు — "లక్ష్మీ! చిరంజీవి ఇంట్లో వున్నాడా?" అని అడిగాడు.

" ఇలాంటి వేళ వాడు ఇంట్లో వుండటం కూడానా?" అంటూ వచ్చింది లక్ష్మి.

"దార్లో కనబడి వాళ్ళ మేష్టారేం చెప్పారో తెల్సా? వీడు బొత్తిగా చదవకుండా వెధవలా తయారౌతున్నాడట. ఎప్పుడూ అల్లరేనట!"

మధ్యలోనే అంది లక్ష్మి — "ఆ మాట నేను మాత్రం ఎన్నిసార్లు చెప్పలేదు మీకు? ఏడేళ్ళ పిల్లాడు ఎంత చక్కగా చదువుకోవాలి? నా మాట వింటాడా ఏమన్నానా? వాడేం చదువుతున్నాడో .... ఎలా చదువుతున్నాడో ఎన్నడైనా పట్టించుకున్న పాపాన పోయారా?" అంది ఎత్తిపొడుపుగా.

"సరేలే! వాణ్ణిలా పిలూ ...."

"తల్చుకున్నప్పుడే తాత పెళ్ళా? బైట ఆడుకుంటున్నాడు. కాస్సేపు ఆడుకోనివ్వండి!"

"ఆటా లేదు, గీటాలేదు. ఆడింది చాలు! ముందు వాణ్ణి పిలు ...."

లక్ష్మి వీధి గుమ్మంకేసి వెళ్ళింది. గోల గోలగా ఆడుకొంటూన్న పిల్లల్ని చూస్తూ నిలబడింది.

వెంకట్రావు బట్టలు మార్చుకుని కాళ్ళు కడుక్కుని వచ్చి కూర్చున్నాడు.

తల్లి సైగతో పరిగెట్టుకుంటూ వచ్చిన చిరంజీవి పకపకా నవ్వుతూ — "అమ్మా! అమ్మా! నేను జోరుగా పరిగెడుతోంటే నన్ను పట్టుకోలేక సీత బోర్లాపడిందే!

భలే పడిందే!" అంటూ మళ్ళీ పగలబడి నవ్వాడు.

"తప్పు! ఎవరన్నా పడిపోతే నవ్వొచ్చునా? నాన్న పిలుస్తున్నారు నిన్ను."

"ఎందుకూ?" నీరుగారిపోయాడు చిరంజీవి.

"ఒరేయ్! ఇలారా!" లోపల్నించి గర్జించాడు తండ్రి — "వెధవ ఆటలు ఆపి, నీ పలకా, పుస్తకాలూ తెచ్చుకో!"

తెల్లబోయాడు పిల్లాడు.

"ఏంరా, అలా నుంచున్నావు? అర్థం కావటంలా? తమరు చాలా గొప్పగా చదువు వెలగబెడుతున్నారని మీ పంతులుగారు చెప్పార్లే. మీ పాండిత్యం జూచి సంతోషిద్దామని .... కదలవేం?" అంటూ హుంకరించాడు తండ్రి మళ్ళీ.

చిరంజీవి భయంగా చూశాడు తల్లికేసి.

తల్లి పుస్తకాల సంచీ తెచ్చి అందించింది. "ఫర్వాలేదులే, కాస్సేపు చదువుకో" అనేసి వంటింటికేసి వెళ్ళిపోయింది. కాస్సేపటికి సంచి పట్టుకుని వచ్చి "కూరగాయలకి వెళ్ళొస్తాను. చదువుకో నాన్నా!" అని కొడుకుతో చెప్పి వెళ్ళిపోయింది బయటికి.

చిరంజీవి నిస్సహాయుడైపోయాడు. సంచి ముందు వేసుకుని కూర్చున్నాడు. తండ్రి దగ్గర బొత్తిగా చనువులేదు.

బిక్క మొహం వేసుక్కూచున్న కొడుకుని చూస్తోంటే వెంకట్రావుకి జాలి వెయ్యలేదు. పిల్లలు చాలా క్రమశిక్షణతో పెరగాలని అతని అభిప్రాయం. పెద్దల్నీ మాష్టర్లనీ గౌరవించాలి. తెలివి తేటలతో చదువుకోవాలి. నియమం ప్రకారం ఆడుకోవాలి. అల్లరి చేస్తే మితంగానే చెయ్యాలి. మంచి మంచి అలవాట్లు నేర్చుకోవాలి. అలా పెరిగిన పిల్లలకు గొప్ప భవిష్యత్తు వుంటుందని అతని నమ్మకం. కొడుకు అలాగే పెరుగుతున్నాడని ఇన్నాళ్ళుగా నమ్ముతూ వచ్చాడు. అదంతా అబద్ధం అనుకుంటే .... నిజంగా మతి పోయినట్టే అయింది వెంకట్రావుకి.

"ఎందుకలా చూస్తావ్! గుణింతాలన్నీ రాయి" హఠాత్తుగా ఆజ్ఞాపిస్తున్నట్టే అన్నాడు. తను ఏదో పుస్తకం తిరగేస్తూ కూర్చున్నాడు.

పావుగంట గడిచిపోయింది. "రాశావా?" అంటూ పలక చూచిన వెంకట్రావు, తెల్లబోయాడు. పలకంతా ఖాళీ!

"ఏం, ఎందుకు రాయలేదు?"

చిరంజీవి వణికిపోతూ అన్నాడు — "రావు నాన్నా!"

వెంకట్రావు తీక్షణంగా చూశాడు. కొంత వరకూ తనని అదుపులో పెట్టుకున్నాడు. "సరే! డిక్టేషన్ రాయి" అంటూ తేలికైన మాటలేవో పదివరకూ చెప్పాడు.

పలకమీద కెక్కినవే నాలుగు! అందులో మూడు తప్పులు! మళ్ళీ కొడుకు మొహంలోకి కోపంగా చూశాడు తండ్రి. "సరే! లెక్కలేమైనా వచ్చా?"

అడ్డంగా తలతిప్పాడు చిరంజీవి.

"ఊఁ, పోనీ అంకెలయినా వచ్చా? ఏదీ, వింటాను, యాభై వరకూ అప్పజెప్పు!" అన్నాడు.

బిగుసుకుపోతున్న కంఠం పెగిలించుకుని చిరంజీవి — "ఒకటీ, రెండూ", అని ప్రారంభించి పద కొండు దగ్గిర ఆగిపోయి ఏడుపు మొహం పెట్టాడు.

"ఇక రావా?"

"ఊఁహూఁ!" అన్నాడు పిల్లాడు వణుకుతూ.

"నిన్ను బళ్ళోవేసి సంవత్సరం దాటిపోయింది. ఇప్పటికి రవ్వంత చదువు కూడా అంటలేదు. ఇంతకాలం నువ్వేం చేసినట్టు?"

"................................"

"మీ పంతులుగారు సరిగ్గా చెప్పటం లేదా? .... అలా గొఱ్ఱెలా తల తాటించటం కాదు, నోరు తెరిచి మాట్లాడు. ఇంట్లో అమ్మ చెప్తోంది కదా? ఎందుకింత బండవెధవ్వయ్యావు? చెప్పు, సరిగ్గా చెప్పు! నీకు చదువుకోవాలని లేదు కదూ? లేదు కదూ?"

"లేదు నాన్నా!" భయం భయంగానే అన్నాడు చిరంజీవి.

"మరి .... మరి .... ఆడుకోవాలనుంది కదూ? గంతులెయ్యాలని వుంది కదూ? చెప్పవేం?"

"అవున్నాన్నా!"

తండ్రికి కోపం ఆగలేదు. చేతిలో వున్న ఇనుప కమ్మీల పలకతో చిరంజీవి నెత్తిమీద బలంకొద్దీ కొట్టాడు.

కెవ్వుమన్నాడు చిరంజీవి! పలక ముక్కలు జలజలా రాలిపడ్డాయి నెత్తిమీద.

వెంకట్రావు కోపం ఇనుమడించింది "చదువు సంధ్యలు మానేసి అడుక్కు తింటావు కదూ? రౌడీ

వెధవా! గంతులెయ్యాలని వుందా?" అంటూ ఛెళ్ళు ఛెళ్ళున కొడుకు చెంపలు వాయించాడు. కోపం తీరక జుట్టు పట్టుకుని వూపుతూ వీపుమీద చరుపులేశాడు. ఘొల్లుమంటూ ఎడుస్తోన్న వాణ్ణి కళ్ళెర్రజేసి కిక్కురు మనకుండా నోరు మూయించాడు.

గంటసేపటికి ఇంటికి చేరిన తల్లికి కొడుకు ఏడుపు మొహంతో కనపడ్డాడు. నేలమీద పలక ముక్కలు!

"ఏవిటీ! పలక బద్ధలయిందేం?" అంది లక్ష్మి కంగారుగా.

"నా చెయ్యిజారి కిందపడిందిలే" అన్నాడు వెంకట్రావు.

తల్లి, కొడుకుని ఓదార్పుగా చూస్తూ, "బాగా చదువుకున్నావా నాన్నా?" అంది.

కొడుకు ఏం చెపుతాడో అన్నట్టు తండ్రి కొడు కుతో— "చాల్లే చదువు, ఫో! ఆడుకో!" అని అరిచాడు.

పిల్లాడు నెమ్మదిగా లేచి తల్లి దగ్గిరికి పరిగెత్తి తల్లిని కావిలించుకుని వుండిపోయాడు.

"పిల్లాడికి ఒకటో రెండో దెబ్బలుపడే వుంటాయి" అనుకుంది తల్లి, నవ్వుకుంటూ.

★ ★ ★

అర్ధరాత్రి నిద్రలో కెవ్వుమంటూ అరిచాడు చిరంజీవి.

"ఏమిట్రా? ఏమైంది?" అంటూ దగ్గిరికి వెళ్ళి వాడి ఒంటిమీద చెయ్యివేసి వులిక్కిపడింది తల్లి. అప్పటికప్పుడు థర్మామీటరు తీసి చూసింది. నూట మూడుపైన! లక్ష్మి గుండెలు దడదడలాడాయి.

"అబ్బాయి ఒళ్ళు జ్వరంతో పేలిపోతోందండీ?" అంది భర్తతో.

వెంకట్రావు మాట్లాడలేదు.

మర్నాడు డాక్టర్ని తీసుకు రాక తప్పలేదు. నాలుగు రోజులు తీవ్రంగా కాసింది జ్వరం. దాదాపు ఒళ్ళెరగని స్థితిలోనే పడివున్నాడు చిరంజీవి. మందు గ్లాసు పట్టుకోబోయి వదిలేశాడు. "అమ్మా! ఈ చెయ్యి నొప్పెడుతోందమ్మా?" అన్నాడు దీనంగా చూస్తూ. తల్లి, పక్క సర్దుతానంటే లేవబోయి — "ఈ కాలు కూడా నొప్పెడుతోందమ్మా!" అన్నాడు బాధగా.

ఆ తెల్లవార్లూ తల్లి చిరంజీవికి కాలూ, చేయ్యా నిమురుతూనే కూర్చుంది. ఆ సంగతి వెంకట్రావుకి చెప్పింది. వెంకట్రావు డాక్టర్‌కి చెప్పాడు. డాక్టర్ చిరం జీవికి ఎక్సరేలు తీయించి చివరకు తేల్చాడు. "అబ్బా యికి తలమీద ఏదో దెబ్బ తగిలి వుంటుంది. ఎడం వైపు నరాలు దెబ్బతిన్నాయి. అందుకే కుడి భాగంలో కాలూ చెయ్యీ ఇలా అయ్యాయి."

అదిరిపడ్డాడు వెంకట్రావు. "దెబ్బా? వాడికేం దెబ్బ తగుల్తుంది డాక్టర్‌గారూ?" అలాంటిదేం లేదండీ!" అన్నాడు కంగారుగా.

"చిన్న పిల్లలకి ఎన్ని దెబ్బలు తగుల్తాయో ఎలా చెప్పగలం? ఏ ఆటలోనో తగిలి వుంటుంది" అంటూ సానుభూతి చూపించాడు డాక్టరు.

"మరి వైద్యం చేస్తే బాగవదా డాక్టరుగారూ?"

"చూద్దాం" అంటూ ఏవేవో కొత్త మందులు రాసి ఇచ్చాడు.

డాక్టర్ రాసిచ్చే కొత్త మందులన్నీ వెంకట్రావు తెస్తూనే వున్నాడు. తల్లి కొడుకు చేత తాగిస్తూనే వుంది.

చిరంజీవి కాలూ చెయ్యీ అవిటిగానే వుండిపో తున్నాయి.

కొడుక్కి జ్వరం వచ్చినప్పుడు వెంకట్రావుకి అను మానంగానే వుంది దెబ్బల భయంతోనే వాడికి అంత జ్వరం వచ్చిందని. అయినా తనని తను వంచించు కుంటూ తిరిగాడు, వాడు ఎప్పటిలా ఆరోగ్యంగానే లేచి తిరుగుతాడని. కాని, వాడు అవిటి వాడయ్యాడు! అందుకు కారణం తనే! ఇంతకన్నా ఘోరం వుంటుందా?

కొడుకు పరిసరాలల్లోనైనా మసల కుండా కొన్నాళ్ళవరకూ తప్పించుకు తిరిగిన వెంకట్రావు, ఇక తనని తను సముదా యించుకోలేక ఒకనాడు కొడుకు మంచం దగ్గిరికి వెళ్ళాడు. చిరంజీవి మీదికి వంగి ఒణుకుతోన్న పెదవులతో వాడి నుదుటి మీద నెమ్మ దిగా ముద్దుపెట్టుకున్నాడు.

మెలకువ వచ్చిన చిరంజీవి తండ్రిని చూస్తూ భయంతో కెవ్వున అరిచాడు.

వెంకట్రావు కొడుకు చేతిని తన చేతుల్లోకి తీసు కుని మృదువుగా నిమరసాగాడు — "నొప్పిగా వుందా నాన్నా?" అన్నాడు.

భయంతో గడ్డకట్టుకుపోయాడు చిరంజీవి.

"మాట్లాడమ్మా! నిన్నెప్పుడూ కొట్టను. అస్తమానూ

ఎత్తుకుని ఆడిస్తాను. షికారుకి తీసికెళ్తాను. నిజం నాన్నా! నిజంగా నిన్నేమీ అనను" అంటూ కన్నీళ్ళతో కొడుకుకి చెప్పుకున్నాడు. .... కొడుకుకి తనమీద పూర్తిగా నమ్మకం కలిగేటట్టే తన ప్రవర్తన మార్చుకున్నాడు.

చిరంజీవి నెమ్మనెమ్మదిగా తండ్రిని నమ్మడం మొదలుపెట్టాడు. భయం తగ్గింది చనువు పెరిగింది. తండ్రి ఒళ్ళో కూర్చుంటున్నాడు. తండ్రిని రోజుకి రెండు మూడు సార్లయినా అడుగుతూనే వుంటాడు "నా కాలూ చెయ్యీ ఎందుకిలా అయిపోయాయి నాన్నా?" అని.

కారణం తెలిస్తే ఏమైపోతాడు చిరంజీవి? లక్ష్మికి కూడా తెలియకుండా దాచిపెట్టాడు. ఎన్నాళ్ళీ గుండెల్లో బరువు? ఎన్నాళ్ళిలా దాచుకోగలడు?

★ ★ ★

వెంకట్రావు ఉలిక్కిపడ్డ వాడిలా లేచాడు. బాగా చీకటి పడిపోయింది. "లక్ష్మీ!" అంటూ గదిలోంచి బైటికి వచ్చాడు. "బాబు ఏం చేస్తున్నాడు?" అన్నాడు.

"నిద్రపోతున్నాడు. మీరలా వున్నారేం? ఒంట్లో బాగాలేదా?" అంది తేరిపారచూస్తూ.

"నువ్విలా రా ఒకసారి."

లక్ష్మి దగ్గిరికి వచ్చింది.

"బాబు మళ్ళీ ఏమైనా అన్నాడా?"

"ఊఁహూ! రెండు బిస్కట్లు పెడితే తిని నిద్ర పోయాడు."

నిట్టూర్చాడు వెంకట్రావు — "వాణ్ణి కుంటివాడని వీధిలో పిల్లలు వెక్కిరించారట. ఏడుస్తూ వచ్చేశాడు...."

లక్ష్మి విచారంగా అంది — "ఇలా జరుగుతుందని ఎన్నడూ అనుకోలేదు. భగవంతుడికి జాలి లేకపోయింది. పసివాడి మీద పగపట్టాడు."

"లక్ష్మీ!" దీనంగా చూశాడు వెంకట్రావు. భర్త మొహంలో అలాంటి దైన్యాన్ని ఎన్నడూ చూడలేదు.

"లక్ష్మీ! చిరంజీవిని భగవంతుడే అవిటివాణ్ణి చేస్తే అది వేరు. ఆ బాధ వేరు. ఈ ఘోరం భగవంతుడు చెయ్యలేదు లక్ష్మీ!"

"భగవంతుడు కాకపోతే ఇంకెవరు చేశారు?"

"నేను చేశాను. నిజం లక్ష్మీ! చిరంజీవిని నేనే కుంటివాణ్ణి చేశాను. ఆరోజు .... నీకు గుర్తుందా? వాడికి చదువు చెప్పాలని కూర్చున్న రోజు .... కోపం ఆపుకోలేక పలకపెట్టి నెత్తిమీద కొట్టాను .... కెవ్వుమన్నాడు. నా దెబ్బల భయానికే జ్వరం తెచ్చుకున్నాడు. నేను కొట్టిన దెబ్బలకే తలలో నరాలు దెబ్బతిన్నాయి. అవిటి వాడయ్యాడు."

తల్లి నిర్ఘాంతపోతూ వింటోంది.

"ఇన్నాళ్ళూ నీకు చెప్పకుండా దాచాను. ఆ రోజున పలక బద్దలైందా అని నువ్వడిగితే నా చేతిలోంచి జారిపడిందిలే అన్నాను. పిల్లాడికి ఎక్కడో ఆటల్లో దెబ్బతగిలి వుంటుందని నేనంటే నువ్వూ అదే నమ్మావు."

"పలక బద్దలైపోయేటంత దెబ్బా పసిపిల్లాడి నెత్తి మీద!" నిర్ఘాంత పోతూ అంది తల్లి.

"అదే లక్ష్మీ! అంత పశువుని నేను. తండ్రిననే పెద్దరికంతో కళ్ళు మూసుకుపోయాయి. పసివాడిమీద అంత పెత్తనం చేశాను. ఇన్నాళ్ళూ నీకీ రహస్యం చెప్పకుండా దాచాను. ఇక నావల్ల కాలేదు."

"................................"

"బాబు రోజూ అడుగుతున్నాడు. 'నా కాలూ చెయ్యీ ఎందుకిలా అయిపోయాయి నాన్నా?' అని అడుగుతొంటే నేనేం చెప్పను? — వాడికెన్ని ఆశలున్నాయి లక్ష్మీ? అవేవీ తీరేవి కావని వాడికెలా చెప్పను?" వెంకట్రావు ఏడుస్తూనే లక్ష్మి చేతులు పట్టుకున్నాడు. "నన్ను క్షమించాననుఁ లక్ష్మీ! భగవంతుడు క్షమించడు. నువ్వయినా క్షమించు లక్ష్మీ! ఒక్క మాట చెప్పు!"

లక్ష్మి అతని చేతులు విదిలించుకుంది. "పసిబిడ్డ బతుకు అంధకారమయం చేసేశారు. మిమ్మల్ని క్షమించడానికి నేనెవర్ని? భగవంతుడెవడు?"

"లక్ష్మీ! నేనెంత బాధపడుతున్నానో అర్థం చేసుకోలేవా? నువ్వు క్షమించకపోతే నాకు శాంతి వుంటుందా?"

"క్షమించమని అడగాల్సింది నన్ను కాదు, భగవంతుణ్ణీ కాదు. వాణ్ణి అడగండి! వాడి బతుకు ఎవరి వల్ల నాశనమైందో వాడికి చెప్పండి! సంతోషిస్తాడు."

వెంకట్రావు మారు మాట్లాడలేకపోయాడు.

[రేడియోలో మొదటిసారి. 1970 కన్నా ముందు కావచ్చు]★